క్లుప్తంగా

ఉపనిషన్మందిరంలో ఉపన్యాసం



వక్త కోమలరావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: కవికర్ణ రసాయన కావ్యం ఒక శృంగార వైరాగ్య కావ్యమని వక్త డాక్టర్ బి.కోమలరావు అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో 'కవి కర్ణ రసాయనము' అనే అంశంపై ఉపన్యాసం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కావ్యం 15వ శతాబ్దానికి చెందిన సంకుసాల నృసింహకవి రచించాడని తెలియజేశారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, నిక్కు అప్పన్న, బాపయ్యపంతులు, రమణమూర్తి, మురళీకృష్ణ, వెంకటరమణ, నరసింహమూర్తి, విశ్వేశ్వరరావు, ఉమారాణి, కరుణ, మంగమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం

శ్రీకాకుళం క్రైమ్: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఉదయం నగరంలోని కొన్ని విద్యాసంస్థలను సందర్శించి గంజాయి వలన కలిగే అనర్థాలు, మహిళల భద్రత, సైబర్ నేరాలు, నారీశక్తి, సంకల్పం కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

ఖాళీ స్థలాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని ఖాళీగా ఉన్న స్థలాలను తక్షణమే పరిశుభ్రం చేసుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వర్షాకాలం కావడంతో పిచ్చిమొక్కలు ఎక్కువగా ఖాళీ స్థలాల్లోనే పెరిగి దోమలు, ఈగలు, పాములు, విష కీటకాలకు నిలయంగా మారుతాయని పేర్కొన్నారు. వర్షపు నీరు ఎక్కువగా నిల్వ ఉంటే అనారోగ్య సమస్యలు వస్తాయని, వెంటనే స్థల యజమానులు 14 రోజుల్లో ఖాళీ స్థలాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు.

11న ఆక్వా రైతుల సదస్సు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఈనెల 11వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న ఆక్వా రైతుల సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా కార్యదర్శి కె.మోహన్‌రావు, కౌలు రైతుల సంఘ జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, గొలుసు పోలారెడ్డిలు పిలుపునిచ్చారు. ఈ మేరకు శ్రీకాకుళంలో ధర్నా పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎఫెండా కౌంటర్ గ్యారెంటీ ఇచ్చి ఆక్వా ఉత్పత్తులు గిట్టుబాటు ధరకు కొనుగోలుకి భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారతదేశ ఎగుమతులపై అమెరికా ప్రభుత్వం 50 శాతం పన్నులు విధించడం సరికాదని, వెంటనే ఆ విధానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు.

భద్రత కల్పించండి



జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఫిర్యాదు కాపీతో నాయిడుగారి రాజశేఖర్

శ్రీకాకుళం క్రైమ్: తనకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అనుచరుల నుంచి ప్రాణహాని ఉందని, అందువలన భద్రత కల్పించాలని శ్రీముఖలింగేశ్వర ఆలయ అర్చకులు నాయుడుగారి రాజశేఖర్ కోరారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని బుధవారం కలిశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. జూలై 10వ తేదీన తనపై కర్రలతో దాడిచేసి హత్యాయత్నం చేశారన్నారు. కానీ చిన్న చిన్న సెక్షన్లు వేసి అక్కడి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. ఇదే విషయమై రాష్ట్రపతి కార్యాలయానికి, జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశానని వెల్లడించారు. ఇవన్నీ తెలుసుకున్న ఎమ్మెల్యే అనుచరులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన చెందారు.

దరఖాస్తులు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఫస్ట్ ఎయిడ్ శిక్షణా కార్యక్రమాలు బోధించడానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దీనికోసం ఎంబీబీఎస్ పూర్తిచేసి సర్టిఫికెట్ మెడికల్ కౌన్సిల్‌లో సభ్యులుగా నంబరు కలిగి ఉన్న అభ్యర్థులు జిల్లా రెడ్‌క్రాస్‌ను సంప్రదించాలని కోరారు. రెడ్‌క్రాస్ ద్వారా శిక్షణ పొందిన డాక్టర్స్‌కు అధికారికంగా నంబరు కేటాయించబడుతుందని ప్రథమ చికిత్స శిక్షణా కార్యక్రమాలు చేపట్టడానికి అర్హత పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 94404 90525 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. నమోదు చేసుకున్నవారికి బ్యాచ్‌లు వారీగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

వానొస్తే.. భయమేస్తోంది..!

- ఆక్రమణలతో నిలిచిపోతున్న నీరు
- ముంపులోనే వరిపంట
- ఆందోళన చెందుతున్న అన్నదాత



సతివాడ - కె.సైరిగాం ప్రాంతాల మధ్య ముంపునకు గురైన తంపర పొలం



కుళ్లిపోతున్న వరిపంట

గార: ఎక్కడైనా వర్షాలు పడితే అన్నదాత ఆనందపడతాడు. కానీ ఈ ప్రాంతంలో మాత్రం తమ పంట ఎక్కడ ముంపులోకి వెళ్లి పాడవుతుందోనని నిత్యం ఆందోళన చెందుతుంటారు. నీరు కిందికి వెళ్లాంటే ఆక్రమణలు అడ్డుగోడగా ఉండడంతో రోజుల తరబడి నిలిచిపోతుంటుంది. ఫలితంగా రైతుల కష్టార్జితానికి కన్నీళ్లే మిగులుతున్నాయి. అధికారులు ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోకపోవడం, ప్రజాప్రతినిధులు కష్టం ఏర్పడినప్పుడు సానుకూల మాటలు తప్పితే పరిష్కారం చూపకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం వాయుగుండం ఏర్పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇదీ విషయం...

గార మండలంలోని అంపోలు మొదలుకొని కొత్తూరు, సైరిగాం వరకు ఉన్న పల్లపు పొలాలు (తంపర) నిరంతరం ముంపుతోనే అవస్థలు పడుతున్నాయి. సాగుకు అవసరమైన ప్రధాన సాగునీటి కాలువలు భైరిదేశిగెడ్డ, వంశధార కుడి ప్రధాన కాలువ ద్వారా ఈ ప్రాంతం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. భైరిదేశిగెడ్డ నీరు శ్రీకాకుళం రూరల్ మండలం పరిధిలోని మామిడివలస, కిష్టప్పపేట ప్రాంతాల్లోని చెరువులకు వెళ్తుంది. అక్కడ నుంచి గార మండల పరిధిలోని అంపోలు వద్ద న్యాయపతి చెరువుకు చేరి, బోది బట్టి ద్వారా దిగువ ప్రాంతాల అవసరాలు తీరుస్తుంది. అయితే ఇదే న్యాయపతి చెరువుకు వంశధార కుడి ప్రధాన కాలువ పంపిణీ వ్యవస్థలో లోపాలు ఉండడంతో నీరు వచ్చి చేరడం అధికమైపోతోంది. ఫలితంగా ఈ ప్రాంతంలో వర్షాలు అధికంగా కురిసే సమయంలో నీరు నిలిచిపోతుంది. అయితే ఇక్కడ నుంచి నీరు బయటకు వెళ్లకపోవడానికి కింది భాగం ఆక్రమణల్లో చిక్కుకుపోవడమే కారణమని అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదు. తూలుగు పంచాయతీ సమీపంలో ముస్తఫఖాన్ గర్భంలో 60 సెంట్లు వరకు ఆక్రమణ జరిగిందని స్థానికులు అంటున్నారు. ఫలితంగా నీరు నిలిచిపోయి పంటలు పాడైపోతున్నాయి.

ఇప్పటికీ ముంపులోనే...

ఇటీవల కురిసిన వర్షాలకు అంపోలు, సతివాడ, కె.సైరిగాం, రాఘవాపురం, తంగుళ్లపేట, నిజామాబాద్, తూలుగు, జల్లువలస ప్రాంతాలకు చెందిన సుమారు 3 వేల ఎకరాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. దీంతో వరి మొక్కలకు జిగురు పడుతున్నాయి. కాగా మరలా ఇప్పుడు వాయుగుండంతో వర్షాలు మొదలవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అందువలన రెవెన్యూ, వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు సమస్యపై దృష్టి సారించి నీటినిల్వ లేకుండా ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు.

ప్రతిఏటా అవస్థలు



తంపర పొలాల నుంచి కింది కాలువల్లోకి నీరు వెళ్లలేని పరిస్థితి ఏర్పడడంతో ముంపు సమస్య ప్రతిఏటా వస్తోంది. ముస్తాఫాఖాన్ వద్ద ఆక్రమణతో నీరు సముద్రంలోకి వెళ్లకుండా రోజుల తరబడి ఉండిపోతోంది. పంట ఆదిలోనే నీరు ఉండిపోవడంతో కుళ్లిపోతున్నాయి.

– పొదిలాపు రాజారావు, రైతు, సతివాడ

పంటలు కాపాడాలి



వర్షాలు పడుతున్నాయంటే మాకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. ఆక్రమణలు వలన నీరు కిందకి వెళ్లకుండా పొలాల్లోనే ఉండి పంట పాడవుతుంది. అధికారులు స్పందించి ముస్తాఫాఖాన్ ఆక్రమణలు తొలగిస్తే సమస్య పరిష్కారమవుతుంది. ఇప్పటికే రెండు విడతలుగా వర్షాలతో నీరు నిలిచిపోవడంతో వరి మొక్కలు చనిపోతున్నాయి.

– సనపల కృష్ణారావు, రైతు, రాఘవాపురం

లైంగిక వేధింపులు అరికడదాం



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిన్నారులపై లైంగిక వేధింపులు అరికడదామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు పిలుపునిచ్చారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో చట్టాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు స్పష్టమైన అవగాహన అవసరమన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలపై లైంగిక వేధింపులు అరికట్టేందుకు చట్టాలు ఎంతో కఠినంగా ఉన్నాయని తెలియజేశారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, చట్టరీత్యా వచ్చే శిక్షలు తల్లిదండ్రులు తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలు తెలుసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడ్వకేట్ జి.ఇందిరా ప్రసాద్, పాఠశాల హెచ్ఎం పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు చేరుకోవడానికి శ్రమించాలి



మాట్లాడుతున్న డాక్టర్ గుంప నాగేశ్వరరావు

ఎచ్చెర్ల: విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవడానికి శ్రమించాలని డాక్టర్ గుంప నాగేశ్వరరావు అన్నారు. మండలంలో చిలకపాలేంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం నిర్వహించిన ఓరియంటేషన్, ఇండక్షన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్య నైపుణ్యంతో కూడుకున్నదని, అధ్యాపకులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని ఆచరిస్తే విజయాలు సొంత చేసుకోవచ్చని సూచించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ దానేటి శ్రీధర్, వీఎం ఎం సాయినాథ్‌రెడ్డి, పి.దుర్గాప్రసాద్‌రాజు, దుప్పల వెంకటరావు, కళాశాల ప్రిన్సిపాల్ జి.టి.చంద్రశేఖర్, రాజ్‌కిరణ్, సునీల్‌కుమార్, కె.మధుకుమార్, పీడీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

'ట్రిగ్గర్ పాయింట్' పోస్టర్ విడుదల



చిత్రం పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ట్రిగ్గర్ పాయింట్ మూవీ పోస్టర్ విడుదల కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయంలో బుధవారం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాకుళం నగర డీఎస్పీ సీహెచ్ వివేకానంద, శ్రీకాకుళం ఎల్రక్టాన్ మీడియా అధ్యక్షుడు ఎస్.జోగి నాయుడు, వాకర్స్ క్లబ్ గవర్నర్ గేదెల ఇందిరాప్రసాద్, ఆరోహి సంగీత కళాశాల విద్వాంసులు పెంకి నాగేశ్వరరావు, చిత్రకారుడు సోడవరం ఈశ్వరరావు తదితరులు పాల్గొని మూవీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సీహెచ్ వివేకానంద మాట్లాడుతూ ఈ సినిమాని శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లో తీసి, ఎంతోమంది శ్రీకాకుళం కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. తక్కువ బడ్జెట్‌లో తీసిన ఈ సినిమా భారీ విజయం సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ చిన్న చిత్రాలను ప్రోత్సహించాలని కోరారు. చిత్ర నిర్మాత, రచయిత పి.హేమంత్ కుమార్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాపై మక్కువతో మన జిల్లా నటీనటులందరినీ ఒక వేదికగా చేసి ఈ సినిమా తీయడం జరిగిందన్నారు. ఈ చిత్రం అందరికీ చేరువయ్యేలా ఉంటుందన్నారు. చిత్ర దర్శకుడు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నిర్మాత హేమంత్ కుమార్ తనను నమ్మి సినిమాకు దర్శకత్వ బాధ్యతలు అప్పగించడంతో చాలా కష్టపడడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సినిమాను చూసి ఆదరించాలని కోరారు. చిత్రకారుడు సోడవరం ఈశ్వరరావు ఈ చిత్రంలో విలన్‌గా చేయడం జరిగిందన్నారు. హీరోయిన్ జాను మాట్లాడుతూ తనకు మంచి క్యారెక్టర్ ఇచ్చినందుకు రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

తగాదాలు సృష్టిస్తే కఠిన చర్యలు

జి.సిగడాం:



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ అవతారం

గ్రామాల్లో వినాయక చవితి నిమజ్జనాల సమయంలో తగాదాలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. ఊరేగింపు సమయాల్లో కమిటీ సభ్యులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకే ఊరేగింపు చేసుకోవాలన్నారు. ఎవరైనా తప్పుడు ఫిర్యాదులు ఇచ్చి పోలీసులను పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిరంతరం నిఘా వేస్తున్నామని వెల్లడించారు. ఆయనతో పాటు ఎస్ఐ మధుసూదనరావు ఉన్నారు.

ఆయన నేత్రాలు సజీవం



జగన్నాథం(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని సీవీ నాగజ్యోతి ఆనంద నిలయం వృద్ధుల ఆశ్రమంలో నివాసముంటున్న టి.జగన్నాథం(75) అనారోగ్యంతో మృతి చెందారు. మరణానంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో వారి అన్నయ్య కుమారులు టి.శ్రీనివాసరావు, మధుసూదనరావు, కె.అప్పారావులు వృద్ధాశ్రమం ఇన్‌చార్జి సాయి సుధాకర్ ద్వారా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. దీంతో మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి పి.సుజాత ద్వారా ఆయన కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, కార్యదర్శి మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది కె.సత్యనారాయణ, పెంకి చైతన్య, నంది ఉమాశంకర్‌లు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా బ్రహ్మాజీ



రణస్థలం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రణస్థలం మండలంలోని జేఆర్‌పురం పంచాయతీకి చెందిన టేకు లక్ష్మణరావు (బ్రహ్మాజీ)ను ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ చేతివృత్తుల విభాగం పార్టీ అధ్యక్షుడిగా నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దీంతో ఆయనను పలువురు అభినందించారు.

కక్ష సాధింపు చర్యలు సరికాదు



జి.సిగడాం: రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడానికి, సాక్షిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు సరికాదని సీనియర్ న్యాయవాది, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి మండిపడ్డారు. బుధవారం ఆనందపురంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులను చూపిస్తుంటే సాక్షిపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. గతంలోనూ సాక్షి ఎడిటర్‌కు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా నేరుగా ఇంట్లోకి వెళ్లి సోదాలు చేశారని గుర్తు చేశారు. మరోసారి సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులు నమోదు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. కూటమి ప్రభుత్వం ఇలాగే చేస్తే రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలందుకుంటున్న దుర్గాదేవి

ఎచ్చెర్ల: మండలంలోని దోమాం గ్రామంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం దుర్గాదేవికి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలు, పాలాభిషేకాలను చేపట్టారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల పాలక మండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కనకదుర్గ ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు ఆలయాల్లో నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం జరిగింది. గుడివీధిలో బలరామ ప్రతిష్ఠ క్షేత్రంగా పేరు పొందిన ఉమారుద్ర కోటేశ్వర స్వామి దేవాలయం నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం ఎమ్మెల్యే గొండు శంకర్ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్‌గా పాండ్రంకి దేవేంద్రనాయుడు నియమితులయ్యారు. ట్రస్టు బోర్డు సభ్యులుగా కోరాడ రమేష్, జంపన శివరామరాజు, శాలిహుండాం శ్రీదేవి, కటారి కమల, కొండ్ర అరుణ, పొదిలాపు అమరవాణి, ప్రధాన అర్చకులు, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆరవెల్లి శ్రీరామమూర్తిలు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ బీఆర్‌వీవీ ప్రసాద్ పట్నాయక్, ఆలయ ఈవో సుకన్య, డీసీసీబీ మాజీ చైర్మన్ సింతు సుధాకర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, అరవల రవీంద్ర, అందవరపు ప్రసాద్, పాండ్రంకి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయంలో...

ఏడురోడ్ల కూడలి వద్దనున్న కనకదుర్గాదేవి ఆలయం నూతన ట్రస్టు బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం ఎమ్మెల్యే గొండు శంకర్ పర్యవేక్షణలో జరిగింది. ట్రస్టు బోర్డుకు వంశపారంపర్య ధర్మకర్తగా మచ్చ బుచ్చిబాబు, బోర్డు సభ్యులుగా సకలా బత్తుల శ్రీనివాస్, ఆకెళ్ల మల్లిఖార్జునరావు, శివకోటి సరళ, మచ్చ జయదుర్గ, పట్నాల వెంకట అప్పల సూర్యనారాయణ, అలజంగి తేజేశ్వనిలు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ బీఆర్‌వీవీ ప్రసాద్ పట్నాయక్, ఈవో శ్యామలరావు, ప్రతాప్, శవ్వాన ఉమామహేశ్వరి, విభూది సూరిబాబు, అర్చకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మరికొన్ని ఆలయాల్లో నేడు...

నగరంలో చిన్న బజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి దేవాలయం, కొన్నావీధి భీమేశ్వరాలయం, తుమ్మావీధిలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ట్రస్టు బోర్డుల ప్రమాణ కార్యక్రమం గురువారం ఉంటుందని సంబంధిత ఆలయాల ఈవో మాధవి తెలిపారు. అలాగే పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయం ట్రస్టు బోర్డు సభ్యులు, వెంకన్నపంతులు సత్రం సభ్యుల ప్రమాణ స్వీకారం జరుగుతుందని ఈవో సర్వేశ్వరరావు వెల్లడించారు.

గుంతలమయం



పాలఖండ్యాం గ్రామ సమీపంలో ఏర్పడిన గోతులు



గోతులు చూపిస్తున్న ప్రయాణికుడు



దవళపేట వద్ద ఏర్పడిన గోతులు



కల్వర్టు వద్ద ఏర్పడిన గోతులు

రాజాం – శ్రీకాకుళం ప్రధాన రహదారిలో పాలఖండ్యాం నుంచి దవళపేట వరకు ఉన్నటువంటి రోడ్డు గుంతలమయంగా మారింది. పాలఖండ్యాం గ్రామ సమీపంలో రెండు అడుగుల లోతులో గోతులు అవ్వడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే దవళపేట గ్రామ సమీపంలో ఇటీవల నిర్మించిన కల్వర్టు వద్ద భారీ గుంతలు అయ్యాయి. ఇక్కడ కూడా ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. సంతవురిటి గ్రామం వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. రాత్రి సమయంలో వీటివలన ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

– జి.సిగడాం

ఏకదంతాయ నమః



శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధిలో అన్నప్రసాద వితరణ



శ్రీకాకుళం కల్చరల్: మొండేటివీధిలో గణపతి ఊరేగింపు



రణస్థలం: తామాడలో దీపారాధన

ఎచ్చెర్ల, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో వినాయక చవితి నవరాత్రులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. లడ్డూ వేలం పాటల్లో ఆసక్తి ఉన్నవారు ఉత్సాహంగా పాల్గొన్నారు. పూజ మండపాల వద్ద చేపట్టిన దీపారాధనలు ఆకట్టుకున్నాయి. పలుచోట్ల నిమజ్జనానికి గణనాథులు తరలివెళ్లారు.

– సాక్షి నెట్‌వర్క్